
# నిశ్శబ్ద సమరం



- కొఠారి వాణీచలపతిరావు

కూరగాయల మార్కెట్ చాలా రద్దీగా ఉంది.

ఎక్కడెక్కడి నుంచో జనం కార్లమీద, స్కూటర్లమీద వచ్చి వారం పది రోజులకు సరిపడ కూరలు కొనుక్కొని వెళుతున్నారు.

చేతిలో చిన్న ప్లాస్టిక్ సంచితో జనంలోనుండి తోసుకుంటూ ముందుకు వచ్చాడు 'భరత్'.

ఓ కూరలమ్మి దగ్గర నిల్చొని ''టమాటాలు కిలో ఎంత?'' అని అడిగాడు.

''ఇరవై రూపాయలు'' అంది కొంటాడేమోనని ఆశగా చూస్తూ.

''అమ్మో! ఇరవై రూపాయలే.''

''బెండకాయలు?''

''ఇవ్వి చీపే బాబూ! తీసుకోండి. కిలో ఎనిమిది రూపాయలకిస్తాను.'' అని 'ఇవ్వ' మనకుండానే గబగబా త్రాసులో వేయటం మొదలుపెట్టింది.

''అహ! వద్దు! వద్దు!! దొండకాయలు ఎంతో చెప్పు.''

''ఐదు రూపాయలు'' అంది కూరలమ్మి విసుగ్గా ముఖం పెట్టి.

''అవేవి వద్దుగానీ. పాలకూర రూపాయకు ఎన్ని కట్టలు ఇస్తావో చెప్పు.''

''పాలకూరైతే ఆరు కట్టలే ఈ తోటకూర తీసుకోండి పన్నెండు కట్టలు వస్తాయి.'' ఆమె మాటల్లోని వ్యంగ్యాన్ని పట్టించుకోలేదు భరత్.

'సరే అవే ఇవ్వు' అని రూపాయి తీసి చేతిలో పెట్టాడు.

విసురుగా పన్నెండు కట్టలు లెక్కపెట్టింది. చేతిలో ఉన్న బ్యాగ్‌లో పట్టకపోవడంతో చంకకు తగిలించుకున్న గుడ్డ సంచీలో వేసుకున్నాడు. ''ఓ పావలా కర్వేపాకు, కొత్తిమీర, ఓ పావలా మిర్చి ఇవ్వు'' అన్నాడు మరో అర్ధరూపాయి చేతిలో పెడుతూ.

''ఆ రోజులు పోయాయి. బాబూ. మీరిచ్చిన అర్ధరూపాయికి కరేపాకు కొత్తిమిర వస్తాయి'' అని రెండు కట్టలు తీసి బ్యాగ్‌లో వేసింది. ఆ సమయంలో ఆమె అధికారం చలాయిస్తున్న మహారాణిలా, అతను ఆ ఆజ్ఞలని తు.చ. తప్పక పాటిస్తున్న సేవకుడిలా అనిపించింది భరత్‌కు.

తలవంచుకొని 'ఫుట్ పాత్' మీద నడుస్తూ ఉంటే 'భరత్' అని ఎవరో పిలిచినట్లు వినిపించింది. ఆగి, వెనక్కి తిరిగి చూశాడు.

రమేష్, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్ సిగరెట్లు తాగుతూ రోడ్డు ప్రక్కన నించుని కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. స్నేహితులను చూసిన సంతోషంతో దగ్గరికి వెళ్ళి 'హలో' అని చిరునవ్వుతో పలకరించాడు భరత్.

''ఏరా! ఎక్కడినుంచి? ఆఫీసునించేనా?'' అని ప్రశ్నించాడు శ్రీధరరెడ్డి.

''ఆఫీసునించే మీరేమిటి ఎప్పుడు కనిపించినా ముగ్గురూ కట్టకట్టుకుని కనిపిస్తుంటారు?'' అన్నాడు భరత్ ముగ్గురి వంక మార్చి మార్చి చూస్తూ.

''మేం రోజూ కలుస్తునే ఉంటాం. ఇంటికెళ్తే ఏముంది బోర్. అందుకే రాత్రి 8 గంటల దాకా ఏ హోటల్లోనో, పార్కులోనో, సినిమా థియేటర్‌లోనో కాలక్షేపం చేసి వెళ్తాం. నువ్వుకూడా రోజూ రావచ్చుకదా? ఎంచక్కా సరదాగా గడపొచ్చు.'' అన్నాడు రమేష్.

''కుదరదురా! ఎప్పుడూ ఏవో పనులు'' అన్నాడు భరత్ సమాధానంగా.

''ఈ రోజు అనుకోకుండా కలిశావ్. రండి అందరం హోటల్లో కూర్చుని కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం'' అన్నాడు సుధాకర్ ఎదురుగానే ఉన్న 'హోటల్'లోకి దారితీస్తూ.

''పదండి వెళ్దాం'' అని సుధాకర్ మాటలను సమర్థిస్తూ ముందుకు దారితీశాడు రెడ్డి.

అయిష్టంగానే తనూ వాళ్ళవెంట కదిలాడు భరత్. నలుగురూ నాలుగు కుర్చీలలో ఒక టేబుల్ ముందు కూర్చున్నారు. సర్వర్ దగ్గరికి వచ్చాడు అతి వినయంగా.

''నాకు ఆకలేస్తోందిరా? ఏమైనా తిందాం!'' అన్నాడు రమేష్. 'నాలుగుదోసె' అని ఆర్డరిచ్చాడు సుధాకర్. దోసె వచ్చేవరకు స్నేహితులు నలుగురు కాలేజీ జ్ఞాపకాలను, పాత స్నేహితులను తలుచుకుంటూ కాలక్షేపం చేశారు. భరత్ మాత్రం ఎక్కువగా మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

''మన ముగ్గురిలో అప్పటికీ ఇప్పటికీ మార్పు లేదు. మనం ఇంకా యువకుల్లా లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నాం. మన భరత్ మాత్రం పెళ్ళయి పిల్లల తండ్రి కాగానే ముసలాడు అయిపోయాడు. ఇల్లు,

ఆఫీసు తప్ప వాడికి మరో గొడవేలేదు. ఇలాగే ఏ రోడ్డు మీదో తగిలినప్పుడు బలవంతంగా మనం గుంజుకొస్తే తప్ప" అన్నాడు సుధాకర్ భరత్ కళ్ళల్లోకి చూడటానికి ప్రయత్నిస్తూ.

వంచిన తల ఎత్తకుండానే సమాధానంగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు భరత్.

వేడివేడి దోసెలు, మంచివాసనలను మోసుకొస్తూ టేబుల్ మీదికి వచ్చాయి. 'హోటల్ దోసె తిని చాలా రోజులయింది' అనుకున్నాడు భరత్ నోట్లో నీళ్ళూరుతుండగా. ప్లేట్ ముందరికి తీసుకొని చాలా ఆరాటంగా సగం దోసె తినేశాడు. మధ్యలో ఏదో గుర్తువచ్చి తక్కున తలయెత్తి ఆ ముగ్గురి ప్లేట్లలోకి చూశాడు.

'అమ్మో! తను చాలా ఫాస్ట్‌గా తినేస్తున్నాడు. ముచ్చట్లలో పడి వాళ్ళింకా పావుదోసె తిన్నారు. ముందు ఎవరు తింటే వాళ్ళు తరువాత ఖాళీగా ఉంటారు గనుక 'బిల్లు' వాళ్ళే ఇవ్వాల్సి వస్తుంది' అనుకున్నాడు, మనసులోనే భరత్. ఆ ఆలోచన రాగానే చేతి వేళ్ళు ఫోర్క్, స్పూన్‌తో ఆడుకోవటం మొదలుపెట్టాయి. వాళ్ళు తినటం అయిపోయి కాఫీకి ఆర్డరిచ్చాక అప్పుడు తను తినలేక తింటున్నట్లుగా ఆఖరి ముక్కను మరింత ముక్కలు చేసి తిని, మెల్లగా కాఫీకి వచ్చాడు భరత్. అప్పటికల్లా వాళ్ళు కాఫీతాగడం అయిపోయింది. ముగ్గురూ బిల్లుకోసం నేనంటే నేనని పోటీపడుతున్నారు. తను మాత్రం 'కాఫీ తాగడంలో బిజీ' అన్నట్లు నటిస్తూ 'ఉండండి నేనిస్తాను' అన్నాడు మాటవరసకి.

ఈలోగా బిల్లు సుధాకర్ పే చేశాడు. 'అమ్మయ్య' అనుకున్నాడు భరత్ గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ.

ఫ్రెండ్సంతా బయటికి వచ్చి వక్కపొడి నములుతూ సిగరెట్లు కాలుస్తూ కబుర్లలో పడిపోయారు.

"ఇంకనేను వస్తారా? చాలా లేట్ అయిపోయింది." అన్నాడు భరత్ పాన్‌షాప్‌లో ఉన్న గడియారం వంక చూస్తూ.

"మంచిది మళ్ళీ ఎప్పుడు కలుస్తావ్?" అన్నాడు రమేష్. "ఎప్పుడో ఇలాగే." అన్నాడు భరత్.

"ఎప్పుడో ఎందుకు? రోజూ రావచ్చుకదా? మేమంతా 'రాజీవ్ చౌక్' దగ్గర రోజూ కలుసుకుని ఏదో ప్రోగ్రాం వేసుకుంటాం. నువ్వు కూడా అక్కడికి వచ్చేయ్" అన్నాడు రెడ్డి.

"చూస్తాను వీలునుబట్టి" అని వెళ్ళిపోయాడు భరత్.


వెళ్తున్న భరత్ వంక చూస్తూ "వీడు వట్టి కంజూస్‌గాడురా. పైసా అంటే పడి చస్తాడు. నలుగురిలో ఉన్నప్పుడు ఎలా బిహేవ్ చేయాలో తెలియదు వీడికి" అన్నాడు సుధాకర్.

"వాడంతే హోటల్‌కెళ్ళినప్పుడు బిల్లు ఎక్కడ ఇవ్వబడుతుందోనని 'స్లో'గా తింటూ ఉంటాడు. బజారులో ఏదైనా కొన్నప్పుడు పెద్ద ఇచ్చేవాడిలా జేబులో చెయ్యి పెట్టి ఎంతకూ బయటికి తియ్యడు." అన్నాడు రెడ్డి.

"ఒకసారి ఇద్దరం బస్టాండులో కలిసినప్పుడు ఎంతకూ బస్సు రాక ఆటో ఎక్కాం. జేబులు తడుముకుంటూ 'వంద రూపాయల కాగితం ఉంది. చిల్లరలేదు ఎలా? అన్నాడు" అన్నాడు రమేష్.

ముగ్గురు మిత్రులూ భరత్ ప్రవర్తనను తలుచుకొని తలుచుకొని పరిహాసంగా నవ్వుకున్నారు.

"ఈ భరత్‌గాడి రోగం కుదిరించాలంటే మనం ఒక పని చేయాలిరా. ఒక రోజు హోటల్‌కు తీసికెళ్ళి చెడామడా తినేసి ఆ బిల్లు వాడి నెత్తిన వేసేయాలి" అన్నాడు సుధాకర్ తనకొచ్చిన దివ్యమైన ఆలోచనకు తానే సంబరపడిపోతూ.



**నిమిషానికి 144**

ప్రపంచంలో రోజూ పెరిగే జనాభా సుమారు 2,08,200. అంటే నిమిషానికి సుమారు 144 మంది పుడుతున్నారు!

"అది నీతరం కాదుగదా. నిన్ను పుట్టించిన ఆ బ్రహ్మతరం కూడా కాదు. ఈ ప్రపంచంలో సాధ్యం కాదు అనుకున్న దాన్ని దేన్నయినా సాధించగలవేమో గానీ భరత్‌తో ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టించలేవు ఛాలెంజ్!" అన్నాడు రమేష్.

"పెట్టించగలను ఇదే నా ఛాలెంజ్. వచ్చే సోమవారం ఇదే రోజు ఇదే హోటల్‌లో భరత్‌తో బిల్లు ఇప్పించితీరతాను." అన్నాడు సుధాకర్ ఆవేశంగా.

వీళ్ళిద్దరూ 'బెట్' కట్టుకోవడం శ్రోతగా మిగిలిన రెడ్డికి చాలా తమాషాగా 'థ్రిల్'గా ఉంది.

వచ్చే సోమవారం సుధాకర్ చేయబోయే 'ట్రిక్'లో చిక్కుకుని బిల్లు పే చేస్తున్న భరత్ ముఖాన్ని ఊహల్లోనే చూసి ముసి ముసి నవ్వులు నవ్వుకున్నడు శ్రీధర్‌రెడ్డి.

★ ★ ★

ఎదురుచూసిన సోమవారం రానే వచ్చింది.

శ్రీధర్‌రెడ్డి, రమేష్ 'రాజీవ్ చౌక్' దగ్గర సుధాకర్ కోసం ఎదురుచూస్తూ నిల్చున్నారు.

సుధాకర్ తనవెంట భరత్‌ను కూడా తీసుకొని రావటం చూసి 'ఘటికుడే' అనుకున్నారు ఇద్దరూ.

పిచ్చాపాటీ అయినాక నలుగురు కలిసి హోటల్‌కు వెళ్ళారు. స్వీట్, హాట్, కూల్‌డ్రింక్స్ కడుపునిండా ఆరగించి భుక్తాయాసంతో త్రేన్చారు, స్నేహితులందరూ. బేరర్ 'బిల్లు' పట్టుకొని వచ్చాడు. రెడ్డి, రమేష్, సుధాకర్ ముఖం వంక చూస్తుండిపోయారు.

"ఫ్రెండ్స్. ఈ రోజు మీకు ఒక ప్లెజంట్ సర్‌ప్రయిజ్. ఈ రోజు భరత్ బర్త్‌డే. అందుకని ఈ పార్టీకి 'హోస్ట్' మన భరత్" అన్నాడు సుధాకర్.

'హేపీ బర్త్‌డే టు యూ' అన్నారు రాగయుక్తంగా రెడ్డి, రమేష్, భరత్‌కు షేక్ హాండ్ ఇస్తూ.

భరత్ బిత్తరపోయి చూశాడు. 'ఈ రోజు తన బర్త్‌డేనా? తన డేటాఫ్ బర్త్ ఏమిటో మర్చిపోయి చాలా రోజులయింది. ఆ. ఆ.. సెప్టెంబర్ పందొమ్మిది ఈ రోజు డేట్ సెప్టెంబర్ పందొమ్మిదే. ఆ విషయం సుధాకర్‌కు ఎలా గుర్తుంది' అనుకున్నాడు ఆశ్చర్యంగా అనుకోకుండా వచ్చిన ఆ అవాంతరానికి పుట్టెడు దిగులు వేసింది.

యాభైరెండు రూపాయల డెభ్భై అయిదు పైసల బిల్లు చూడగానే కళ్ళు గిర్రున తిరిగాయి.

కానీ ఇవ్వక తప్పదు. లేకుంటే స్నేహితుల మధ్య నవ్వులపాలు కావల్సి వస్తుంది. అన్న ఆలోచన రాగానే మనసులోని భావాన్ని కప్పిపుచ్చుకోవటానికి పెదవి మీద ఒక కృత్రిమపు నవ్వు పులుముకుని భారంగా పర్సు బయటికి తీశాడు.

విజయగర్వంతో స్నేహితులవంక కనుబొమలు ఎగరేస్తూ చూశాడు సుధాకర్. ఓటమిని ఒప్పుకుంటూ ముఖాలు వేళ్ళాడేశారు రెడ్డి, రమేష్.

ఖాళీ అయిన పర్సుతో వెలాతెలా పోతున్న ముఖంతో భరత్ ఇంటికెళ్ళిపోయిన తర్వాత, ముగ్గురూ పగలబడి నవ్వుకున్నారు.

"పూర్ ఫెలో ఆముదం తాగిన ముఖం పెట్టేశాడు" అన్నాడు సుధాకర్.

"అవును గానీ. వాడి బర్త్‌డే విషయం నీకెవరు చెప్పారు?" సందేహంగా అన్నాడు రెడ్డి.

"నా బర్త్‌డే సెప్టెంబర్ పద్దెనిమిదయితే వాడి బర్త్‌డే పందొమ్మిది. [illegible] చదువుకునే రోజుల నుండి నాకు బాగా గుర్తుండిపోయింది. ఆ విషయం వాడికే గుర్తు లేనట్లుంది. సడన్‌గా చెప్పేసరికి ఖంగారు పడిపోయాడు పాపం!" అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

★ ★ ★

ఎక్కువ రోజులు వుండిపోతే కొబ్బరినూనె మెతక వాసన వేస్తుంది. ఒక కిలో నూనెలో ఓ ఐదు సెంటీమీటర్ల కర్పూరం వేసి వడేసి వుంచుకుంటే, సువాసనకి సువాసన- చాలా కాలం నిల్వవుంటుంది.

• • •

బిస్కట్లు గట్టి మూత వున్న డబ్బాలో పెట్టగానే సరికాదు. రెండు షుగర్ క్యూబ్‌లు వేసి పెట్టే— బిస్కట్లు మెత్తబడవు.



### 'పిహెచ్‌డి' పొందిన రచయిత్రి

కథారచయిత్రిగా 'వనిత' పాఠకులకు సుపరిచితురాలైన శ్రీమతి కొఠారి వాణీ చలపతిరావు (వాణీ కుమారి)కి ఉస్మానియా విశ్వవిద్యాలయం 'క్షైత్రియతలు - చారిత్రక పౌరాణిక అంశాలు' అన్న సిద్ధాంత గ్రంథానికి పి.హెచ్‌డి పట్టా ప్రదానం చేసింది.
శ్రీమతి వాణీ చలపతిరావుకి 'వనిత' అభినందనలు అందజేస్తోంది.

ఈ సంఘటన జరిగిన రెండోరోజే అడ్రస్ వెతుక్కుంటూ భరత్ ఇంటికి వెళ్ళాడు సుధాకర్. భరత్ పని చేస్తున్న ఆఫీసులో ఒక ఆఫీసరుతో అనుకోకుండా అతనికి పనిబడింది. కొంచెం రికమండ్ చేయమని అడగటానికి వచ్చాడు.

రెండుగదుల ఒక పాత పోర్షన్ అది. గుమ్మం ముందు కూచొని పెద్ద కుంకుమబొట్టు, రంగు పోయి పాతబడిన వాయిల్ చీర ధరించిన ఒక స్త్రీ పాత సీసాలు, డబ్బాలు అమ్ముతూ కనిపించింది.

''పామాయిల్ డబ్బాకు నలభై పైసలేమిటి? అర్ధరూపాయి. నీకిష్టమయితే తీసుకో, లేకుంటే లేదు.'' అని పాత సీసాలు, డబ్బాలు కొనేవాడితో కొట్లాడుతున్నది.

''భరత్ ఉన్నాడాండీ'' అన్న కంఠాన్ని విని ఉలిక్కిపడి తలెత్తి చూసి ఖంగారుగా. ''తరువాత రాపో ఇప్పుడు కుదరదు'' అని పాతసామాను కొనే అబ్బాయికి చెప్పి ''ఉన్నారు రండి'' అంది.

ఆ సమయంలో అక్కడ అపరిచిత వ్యక్తిని చూసి తను చేస్తున్న పనికి సిగ్గుపడుతున్న దానిలా లోపలికి వెళ్ళిపోయింది ఆమె.

ముందు గదిలో ఉన్న రేకు కుర్చీలో కూర్చుని ఇల్లంతా పరకాయించి చూడసాగేడు సుధాకర్. ఆ గదిలోనే ఒక పక్క చిన్న నవారు మంచం మీద ఒక ముసలమ్మ రొప్పుతూ, ఆయాస పడుతూ ఏదో వ్యాధితో బాధపడుతున్న దానిలా కనిపించింది. ఒక మూలగా పాత చెక్క బీరువాలో కొన్ని పుస్తకాలు, బట్టలు, చెప్పులు కనిపించాయి. మరో పక్కగా కట్టబడిన 'దండెం' మీద చినుగులు బయటికి కనిపిస్తున్న చీర, లుంగి, షర్టు కనిపించాయి. లోపలి గది వంటకు, భోజనాలకు కేటాయించబడినట్లుంది.

''హలో! వాట్ ఎ ప్లజంట్ సర్ప్రయిజ్. ఊరక రారు మహానుభావులు'' అని నవ్వుతూ బయటికి వచ్చాడు భరత్. వచ్చిన పని చెప్పాడు సుధాకర్. ఒక పక్క సుధాకర్‌తో మాట్లాడుతూనే మరో పక్క తన ఇంటి వాలకాన్ని చూసి తనే సిగ్గుపడుతున్నట్లు అతని చూపులే చెప్పక చెబుతున్నాయి.

''ఆవిడ మీ అమ్మగారా?'' మంచంలో ఉన్న ముసలమ్మ నుద్దేశించి అన్నాడు సుధాకర్.

''అవును ఆవిడకు ఆరోగ్యం సరిగా ఉండదు'' క్లుప్తంగా సమాధానం ఇచ్చాడు భరత్ ''ఇంక నేను వస్తాను'' అని లేచాడు సుధాకర్ ''ఉండు టీ తాగి వెళ్దువుగాని. రాకరాక ఫస్ట్‌టైమ్ మా ఇంటికి వచ్చావు'' అని లోపలికి వెళ్ళాడు భరత్.

''వనజా! టీ పెట్టు'' అన్నాడు భార్య నుద్దేశించి. వనజ ఏదో గొణుగుతోంది. వాళ్ళ గుసగుసలు అస్పష్టంగానయినా అవతల కూర్చున్న వాళ్ళకి వినబడక పోవటానికి అది పెద్ద భవంతి ఏం కాదు.

''మీకెన్నో సార్లు చెప్పాను. ఒకసారి లోపలికి వచ్చి ఇంట్లో ఏం ఉన్నాయో, లేదో చూశాక..'టీ', 'కాఫీ'లు అడగమని. బయట కూర్చుని పెద్ద దర్జాగా 'టీ' అని వచ్చిన వాళ్ళ ముందు 'ఆర్డర్' జారీ చేస్తే, చివరకు నేను అది చెయ్యలేక పోతే ఎంత అసహ్యంగా ఉంటుంది''.

''ఇప్పుడేం లేవు?'' భరత్ గొంతులో విసుగు తొంగిచూస్తున్నది.

''షుగర్ లేదు''

''బ్లాక్ టీ పెట్టు''

''ఎందుకు మన దరిద్రాన్ని ఆయన ముందు చాటి చెప్పుకోవటానికా?''

''నా దగ్గర రెండు రూపాయలు ఉండాలి. ఓ యాభైగ్రాములో వందగ్రాములో తెస్తాను. అందాక నువ్వు టీ కలిపి ఉంచు'' అని షర్ట్ వేసుకొని బయటకి బయల్దేరాడు భరత్.

ఆ సంభాషణ విన్న సుధాకర్ మనసంతా చేదుగా మారిపోయింది.

''నాకు ఇప్పుడేం వద్దురా! ఇప్పుడే 'టీ' తీసుకొని వస్తున్నాను''అంటున్నా వినిపించుకోకుండా బయటికి వెళ్ళాడు భరత్. ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తూ కూర్చున్నాడు సుధాకర్.

భరత్ తల్లి, లేని ఓపిక తెచ్చుకుని మంచంలో లేచి కూర్చుంది. సుధాకర్‌ను ఆప్యాయంగా భరత్‌తో అతని స్నేహాన్ని గురించిన వివరాలు అడిగింది.

''మీకు ఆరోగ్యం బాగుండనట్లుంది. మందులు వాడటం లేదా?'' అని పలకరించాడు ఆమెను ఏం మాట్లాడాలో తోచక. తరువాత తన ప్రశ్న తనకే నచ్చలేదు.

''పాపం మా వాడ్ని చూస్తుంటే జాలేస్తుంది బాబూ నాకు. ఈ ప్రపంచంలో ఉన్న డాక్టర్లందరికీ చూపించి, మంచి మందులు వాడి నన్ను బ్రతికించుకోవాలని ఉంటుంది వాడికి. కానీ చాలీచాలని జీతం. వెనక ముందు ఆస్తిపాస్తులేమీ లేవు. కాలం చూస్తే మరీ తగలబడి పోతున్నది. ముగ్గురు పిల్లలు, పెళ్ళాం పోషణ కాక నా రోగాలు, మందులు వాడికి ఒక అదనపు భారం అయింది. నన్ను గురించి బాధపడుకురా అంటే వినడు. మొన్నటికి మొన్న నాకు అయాసం ఎక్కువై ప్రాణాల మీదికి వస్తే కోడలి చెవిదిద్దులు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చాడు. డాక్టరు ఖర్చులు పోను మందులు తేవాలని యాభై రూపాయలు జేబులో పెట్టుకొని పోతుంటే దారిలో ఎవరో పర్స్ కొట్టేశారట. ముఖం చిన్న బుచ్చుకొని ఇంటికి వచ్చాడు. ఆ రోజు వాడికి ఏడుపొక్కటే తక్కువ'' రొప్పుతూనే ఒక్కొక్కమాట అతి కష్టం మీద అంటున్నది ఆమె.

సుధాకర్‌కు ఆ మాటలు వినగానే ఎవరో చెర్నకోలతో వీపుమీద ఒక్కటి చరిచినట్లయింది. ఆ పర్స్ కొట్టేసింది ఎవరో కాదు తనే. ఎదుటి వాడి కష్టసుఖాలను, పరిస్థితులను అర్థం చేసుకోకుండా పందెం కట్టాడు. పెద్దలు సంపాదించిన ఆస్తిపాస్తులకు వారసుడైన తను ఉబుసుపోకకు 'ఛాలెంజ్' చేసి ఎదుటి వాడి ఆర్థిక బలహీనతను వెక్కిరించాడు అనుకున్నాడు సుధాకర్ పశ్చాత్తాపంతో.

'నిజంగా భరత్ ఇలాంటి పరిస్థితులో ఉన్నాడని తనకు తెలియదు.' అనుకున్నాడు మనసుకు సంజాయిషీ చెబుతూ.

సుధాకర్ లాంటి వాళ్ళకి, భారతదేశంలో భరత్ లాంటి వ్యక్తులే చాలా మంది ఉంటారని, ఖరీదైన సమాజంలో నిత్యం బ్రతుకును కొనుక్కోలేక నానా అవస్థలు పడుతుంటారని తెలియదు.

బ్రతుకు పోరుకై కడుపు నిండా కాక పోయినా సగమైనా అన్నం తినాలి. చావుతో పోరాడాలంటే రోగాలకు మందులు వేసుకోవాలి. ఇవన్నీ డబ్బులు పెడితేనే గానీ దొరకవు. అందుకే బ్రతుకును నిత్యం కొనుక్కోవాలనుకునే ఆరాటంతోనే సగటు మనిషి నలిగి పోతుంటాడు. ఆ సగటు మనిషికి ప్రతీక 'భరత్'.

□

ఎలక్ట్రానిక్ రిమోట్ కంట్రోల్‌కి దుమ్ము కొట్టకుండా, గీతలు అవీ పడి పోకుండా వుండలన్నా, తడిచేతులు తగులుతాయన్నా దాన్ని పల్చని ప్లాస్టిక్ షీట్‌తో కవర్ చేసి రబ్బర్ బాండ్ పెట్టండి. భద్రంగా వుంటుంది.

• • •

గొంతు రాసుకు పోయినట్టుంటే చిన్న పిప్పర్‌మెంట్ చప్పరించండి. లేకుంటే 1/2 చెంచా చక్కెరలో నాల్గు మిరియపు గింజలు వేసి నమలండి.